క్లుప్తంగా

చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు విద్యార్థుల విరాళం



చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధికి చెక్కు అందిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు భారీ విరాళం అందజేశారు. ఆరిలోవలో ఎస్.సుబ్బలక్ష్మి అనే మహిళ నిర్వహిస్తున్న ఈ ఫౌండేషన్‌కు విరాళం అందజేయడానికి శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చారు. ఈ మేరకు 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇటీవల రూ.2,44,552 వరకు విరాళాలు సేకరించారు. ఆ నగదును చెక్కు రూపంలో గురువారం పాఠశాలలో ఆరిలోవ సీఐ సోమశేఖర్ సమక్షంలో ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.సుబ్బలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సీఐ అభినందించారు. చిన్నతనం నుంచే ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన కలగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత ముని మోహన్‌కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృత దినోత్సవం



సంస్కృతం అధ్యాపకుడు ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సంస్కృతం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సంస్కృత అధ్యాపకుడు డాక్టర్ ఉమామహేశ్వరరావును ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంస్కృతం మన ప్రాచీన భాష అని, అన్ని భాషలకు తల్లి లాంటిదని చెప్పారు. సమస్త సాహిత్యం సంస్కృతంలోనే ఇమిడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి



రికార్డు రూంలో పరిశీలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ తీరుతెన్నులపై సీఐ ఎస్.విజయకుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. కొద్ది కాలంగా రికార్డు రూంలో భద్రపరచిన పలు కేసుల్లో ఉన్న వస్తువులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కేసుల రికార్డులకు ప్రాధాన్యమిచ్చి భద్రపరచాలన్నారు. పోలీస్ స్టేషన్‌తోపాటు ఆవరణను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సీఐ సూచించారు.

నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణకు వినతి

అగనంపూడి: విశాఖ–నర్సాపురం మధ్య గతంలో నడిపిన నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ పలు ప్రజా సంఘాలు రైల్వే జనరల్ మేనేజర్, రైల్వే బోర్డు అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు. కరోనా సమయంలో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేశారన్నారు. ఇటీవల సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేయడంతో ప్రయాణికులకు విశాఖ నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు రాకపోకలు ఇబ్బందికరంగా మారాయన్నారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను పునరుద్ధరించాలని నాయకులు కోరారు.

సరికొత్తగా మినీ కన్వెన్షన్ హాల్

- ఎంవీపీలో రూ.4.15 కోట్లతో నిర్మించనున్న వీఎంఆర్‌డీఏ
- 5 వేల చదరపు అడుగుల్లో రెండు భారీ ఫంక్షన్ హాల్స్ నిర్మాణం



నిర్మాణ పనుల కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విజయనిర్మల, తదితరులు(ఫైల్)



మినీ కన్వెన్షన్ హాల్ నమూన చిత్రం

ఎంవీపీ కాలనీ: విశాఖ తూర్పు నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం ఎంవీపీ కాలనీలో మినీ కన్వెన్షన్ హాల్ అందుబాటులోకి రానుంది. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారు. శంకుస్థాపన ప్రక్రియ కూడా పూర్తయింది. ఎంవీపీ కాలనీ సెక్టార్–1లో శిథిలమైన వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం స్థానంలో పార్కింగ్ సెల్లార్‌తో పాటు రెండు అంతస్తుల్లో అధునాతనంగా ఈ కన్వెన్షన్ హాల్‌ను నిర్మించనున్నారు.

రూ.4.15 కోట్లతో నిర్మాణం

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రూ.4.15 కోట్ల వ్యయంతో ఈ కన్వెన్షన్ హాల్ నిర్మాణం చేపట్టనున్నారు. సెల్లార్+ 2 ఫ్లోర్స్‌గా దీని నిర్మాణం జరగనుంది. 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నిర్మాణంలో సెల్లార్‌ను పూర్తిగా పార్కింగ్ కోసం కేటాయించనున్నారు. పై రెండు అంతస్తుల్లో రెండు భారీ హాల్స్‌ను నిర్మించనున్నారు. 5000 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ హాళ్ల నిర్మాణం జరగనుంది. దీంతో పాటు అధునాతన సీటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. సీలింగ్, ఎలివేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించారు.

ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా..



నగర వాసులతో పాటు ప్రధానంగా తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా ఈ మినీ కన్వెన్షన్ హాల్ నిర్మాణం జరగనుంది. ఎంవీపీ కాలనీ సెక్టార్–1లో వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం శిథిలావస్థకు చేరి చాలా కాలంగా నిరుపయోగంగా ఉంది. దీని స్థానంలో మినీ కన్వెన్షన్ హాల్ నిర్మించనున్నాం. పాత కల్యాణ మండపం కూల్చివేత పనులు పూర్తయ్యాయి. పునర్నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. అక్టోబర్ నుంచి నిర్మాణం ప్రారంభమవుతుంది.

– అక్కరమాని విజయనిర్మల, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్

ఆత్మీయ బంధానికి 'రక్ష'

- ఘనంగా రక్షాబంధన్ వేడుకలు
- సోదరులకు రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లు



రేసపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సందడి



పాఠశాలకు వెళ్తున్న సమయంలో సోదరికి రాఖీ కడుతున్న ఓ చెల్లి



తమ్ముడికి రాఖీ కడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: సోదరీ, సోదరుల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్‌ను తూర్పు నియోజకవర్గ పరిధిలో గురువారం వేడుకగా జరుపుకొన్నారు. సోదరులకు అక్కచెల్లెమ్మలు రాఖీ కట్టారు. పలువురు ప్రజా ప్రతినిధులు స్థానిక మహిళలతో పాటు బ్రహ్మకుమారీలు రక్షాబంధన్ కట్టారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పెదగదిలిలో తన నివాసం నుంచి రవీంద్రనగర్ వెళ్లి సోదరుడు డాక్టర్ భార్గవ్‌దినేష్‌కు రాఖీ కట్టి స్వీటు తినిపించారు.

ఏఎస్ రాజా మైదానంలో వైద్య శిబిరం



క్యాంపులో వైద్య సేవలు వినియోగించుకున్న వాకర్స్

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–8లోని ఏఎస్ రాజా మైదానంలో గురువారం ఉదయం వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఓమ్ని ఆర్కే ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం నడక కోసం వచ్చే వారితో పాటు పలువురు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బ్లడ్, షుగర్, బీపీతో పాటు పలు రకాల పరీక్షలు చేసి, అవసరమైన మందులు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రావణమాస ప్రత్యేక కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మి పూజలు గురువారం 15వ రోజుకి చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మీ ప్రత్యేక పూజలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు గురు, శుక్రవారాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, తిరిగి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. పరోక్షంగా పూజలో పాల్గొనాలనుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు పూజా రుసుం జమచేసి, పేరు గోత్రం, చిరునామా తదితర వివరాలు 89855 15989 వాట్సప్ నంబరుకు పంపాలి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి యువకులకు రిమాండ్

మర్రిపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్, కంచరపాలెం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో బెంగుళూరుకు చెందిన నందిగుడి సచిన్, మంజునాథ సుదీప్ అనే ఇద్దరు యువకులు అనుమానస్పదంగా సంచరించడంతో దాడులు చేసి వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు అరకు ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి బెంగుళూరులో అధిక ధరకు విక్రయించడానికి తరలిస్తున్న సమయంలో గురువారం మధ్యాహ్నం వీరిని పట్టుకున్నారు. కంచరపాలెం సీఐ ఎస్.సాయి నేతృత్వంలో యువకులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఇన్నోవేషన్ చాలెంజ్‌లో మధురానగర్ హైస్కూల్ ఫస్ట్



ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శాంతికుమారి

సీతంపేట: రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ గ్రాండ్ ఫినాలేలో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. పాఠశాల విద్యా శాఖ, యూనిసెఫ్ సంయుక్తంగా ఆగస్టు 28 నుంచి 30 వరకు విజయవాడలో నిర్వహించిన ఈ పోటీలో సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు దుర్గా కాత్యాయిని, జోష్ నాగేంద్ర, జశ్వంత్, ప్రదీప్‌కుమార్ 'సెక్యూరింగ్ ఫార్మ్స్ ఫ్రం యానిమల్స్ యూజింగ్ లేజర్ టెక్నాలజీ' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీ, రూ.లక్ష నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను విద్యార్థులు అందుకున్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన సభలో హెచ్‌ఎం పి.శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది ప్రతిభ చూపిన విద్యార్థులను, ప్రాజెక్టు రూపకల్పనలో గైడ్‌వేసిన సైన్స్ టీచర్ ఎం.ఎ.భ్రమరాంబను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట పొలాల్లోకి జంతువులు వచ్చినపుడు లేజర్ లైట్ ద్వారా సిగ్నల్ వెళ్లి అలారం మోగడంతో పంటను వాటి బారి నుంచి కాపాడుకునేలా విద్యార్థులు ప్రాజెక్టు రూపొందించారన్నారు. ఇటీవల అలిపిరి మెట్ల మార్గంలో చిరుతపులి వచ్చిన సంఘటన జరిగిందని, దాని నుంచి రక్షణగా మెట్ల మార్గానికి ఇరువైపులా లేజర్ లైట్స్ సాయంతో అలారం మోగేలా చేయొచ్చని విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టును చూసి న్యాయనిర్ణేతలు మొదటి బహుమతి ప్రకటించారన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన 27 పాఠశాలలు ఈ తుది పోటీలో పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఆవిష్కరణలు చేపట్టాలని ఆకాంక్షించారు.

మార్మోగిన నృసింహ నామం

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీ వరాహ నృసింహ నామం మార్మోగింది. గురువారం ఉదయం శ్రీ వరాహ నృసింహ యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో గల శ్రీ రాధాకృష్ణులను, సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వాములను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని పర్యవేక్షించారు.

అఖండ హనుమాన్ చాలీసా పారాయణ రేపు

దాబాగార్డెన్స్ : అప్పయ్యనగర్‌లోని భూసమేత విజయ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 2న వెంకటేశ్వర ఫౌండేషన్, అప్పయ్యనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధి హరినాథ్, శ్రీహరేరామ సంకీర్తన భక్త బృందం ఉపాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 108 సార్లు హనుమాన్ చాలీసా నిర్వహిస్తామన్నారు.

2న 'నీ స్నేహం కోసం..'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : ప్రముఖ గిటారిస్ట్ కన్నాజీ స్మారకార్థం 2వ తేదీన అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నీ స్నేహం కోసం'పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు సుప్రీం ఆర్కెస్ట్రా ఇంటర్నేషనల్ లైవ్ బ్యాండ్ అధినేత డాక్టర్ సుప్రీం శేఖర్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుప్రీం శేఖర్ మాట్లాడుతూ అనేక సినీ సంగీత కార్యక్రమాల్లో గిటార్ వాయిద్యంతో ఖ్యాతి గాంచిన కన్నాజీ జ్ఞాపకార్థం నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకుడు డేవిడ్, నందిత, రాజేంద్రప్రసాద్, రమేష్ పట్నాయక్, సునీత, అబిద్, అలీ తదితరులు తెలుగు, హిందీ చిత్ర గీతాలు ఆలపిస్తారని చెప్పారు. ప్రత్యేక సంగీత వాయిద్యాలతో సీనియర్ కళాకారులు అలరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పారుల్ కుమార్, నేవీ చిల్డ్రన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కన్నాజీ తల్లి వసుందరా దేవిని సత్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గాయకులు రాజేంద్రప్రసాద్, నందిత, కీబోర్డు ఆర్టిస్ట్ సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల బాలాజీకి తిరుప్పావడ సేవ



తిరుప్పావడ సేవలో భాగంగా శ్రీవారికి నివేదించిన పులిహోర

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో శ్రీ తిరుమల బాలాజీకి గురువారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. స్వామివారికి పులిహోర రాశులుగా పోసి, జిలేబీలు తదితర వంటకాలతో తిరుప్పావడ సేవా పూజ జరిపించారు. తిరుమల బాలాజీ నేత్ర దర్శనంతో భక్తులు పరవశులయ్యారు. సాయంత్రం పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఏయూ సమాచారం

సృజనాత్మకతే సంపద



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: సృజనాత్మకతే పెద్ద సంపద అని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత తెలిపారు. ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అంకుర సంస్థల దిశగా యువత సామర్థ్యాల పెంపు' అనే అంశంపై గురువారం ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఆర్.విజయశాంతి స్మారకార్థం ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ సంక్లిష్ట విధానాల్లో ఆలోచించడం, డిజైనింగ్ చేయడం, స్టార్టప్స్‌ను స్థాపించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఏ హబ్ మేనేజర్ దివాకర్ స్టార్టప్స్ విస్తృతి, ప్రగతి, అనుకూల పరిస్థితులను వివరించారు. డాక్టర్ రవి సరిపల్లి డిజైన్ థింకింగ్ అంశంపై డాక్టర్ విజయశాంతి స్మారకోపన్యాసం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత నుంచి 44 నవ్య ఆలోచనలు వచ్చాయి. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని తమ నవ్య ఆలోచనలను పంచుకున్నారు. విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.రమాసుధ, ఆర్.వి.ఎస్.మూర్తి, పి.కాంత ప్రసాద్, డాక్టర్ కె.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

దేవానంద్‌కు వర్సిటీ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఏయూ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పరిశోధక విద్యార్థి దేవానంద్ విప్పర్లకు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు పేటేటి ప్రేమానందం పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ ద ఇష్యూష్ అండ్ కానిక్వెన్సెస్ ఆఫ్ బైఫర్‌కేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఇన్ టూ సెపరేట్ స్టేట్స్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి ఆయన గురువారం డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు.

పావనికి కొనసాగుతున్న చికిత్స

ఎంవీపీ కాలనీ: మేడ పైనుంచి జారిపడి గాయాలపాలైన పావనికి కేజీహెచ్‌లో చికిత్స కొనసాగుతోంది. ఎంవీపీ కాలనీ సెక్టార్–6కు చెందిన పావనీ(17) మేడపై నుంచి జారిపడిన ఘటన బుధవారం రాత్రి ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న విషయం తెలిసిందే. కొమ్మాదిలోని ఓ రెసిడెన్సియల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న పావనీ ఇటీవల ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఇంటికి వచ్చింది. రాత్రి మేడపైకి ఎక్కి రెండు అంతస్తులపై నుంచి కిందపడిపోయింది. కిందింటి వారు గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి నుంచి చికిత్స పొందుతున్న పావనీ ఇంకా అపస్మారక స్థితిలోనే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయలేదన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి



ధరలు తగ్గించాలంటూ సీపీఎం నాయకుల ప్రదర్శన

మద్దిలపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం సమరభేరిలో భాగంగా గురువారం మద్దిలపాలెం నుంచి రేసపువానిపాలెం వరకూ ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కే ఎస్వీ కుమార్ మాట్లాడుతూ పెంచిన నిత్యావసర వస్తువుల ధరలతో పాటు, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఏడీఎం యాసిన్

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లో గురువారం రాత్రి జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. డ్వాక్రా, దివ్యాంగుల స్టాళ్లతోపాటు కూరగాయలు, ఇతర స్టాళ్లను పరిశీలించారు.

సాయంత్రం బజార్‌కు వచ్చే రైతుల ఐడీ కార్డులు, వారి రికార్డులను, కాటాలను పరిశీలించి మాట్లాడారు. ఈ–క్రాప్ ద్వారా పంట పొలాలపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నాగబంధం విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న కార్పొరేటర్ గోవింద్, సీతంపేట పెద్దలు

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి ఆలయం ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద గురువారం నాగబంధం విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు శివగణేష్‌శర్మ మంత్రోచ్ఛారణల నడుమ మోకర వెంకటరావు దంపతుల చేత ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్య అతిథి 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ విగ్రహానికి క్షీర, పంచామృతా, అన్నాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సారిపిల్లి గంగరాజు, బోర వెంకటరమణ, నమ్మి వెంకట్, ముప్పల రాజారావు, ముప్పల పాపారావు, ఇసరపు అప్పారావు, సానబోయిన సురేష్, వారాధి యర్రాజి, బోర గోవింద్, బోర శ్రీను, సారిపిల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

931వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మికులు

కూర్మన్నపాలెం: కార్మికులను రోడ్డున పడేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ కుటిల నిర్ణయాన్ని దేశ ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 931వ రోజు గురువారం పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. దేశంలో సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి దానిని అమ్మే హక్కు లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.